దొంగలకు అడ్డాగా సింగ్‌నగర్

- వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న స్థానికులు
- వరదల్లోనూ ఎనిమిది ఇళ్లల్లో చోరీలు
- ఇంటి ముందు నిలిపిన బైకులు.. సామాన్లతోపాటు డ్రెయిన్లపై పెట్టిన ఐరన్ గ్రిల్స్ కూడా స్వాహా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కాదేదీ చోరీకి అనర్హం అన్నట్లుగా అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇళ్లల్లో ప్రవేశించి బీరువా తాళాలు పగలకొట్టి బంగారు, వెండి వస్తువులు, నగదు మొదలుకొని ఇంటి ముందు నిలిపిన బైకులు, వాటిల్లోని పెట్రోలు, ఇంటి సామాన్లను కూడా చాకచక్యంగా కొట్టేస్తున్నారు. చివరికి రోడ్లపై ఉన్న డ్రెయిన్ల మీద అమర్చిన ఐరన్ గ్రిల్స్‌ను సైతం విరక్కొట్టి చోరీలకు పాల్పడుతున్నారు. వరుస దొంగతనాలతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు.

వరదల్లోనూ వదల్లేదు

ఓ పక్క బుడమేరు వరద ముంపుతో జనం ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని పరుగులు పెడితే వాటినే అదునుగా చేసుకొని దొంగలు బరితెగించి చోరీలకు తెరలేపారు. వరద నీటిలోనే తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లోకి ప్రవేశించి బీరువాల్లో దాచుకున్న బంగారు, వెండి, నగదును కాజేశారు. ఒక్క సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఎనిమిది చోరీ కేసులు నమోదు అయ్యాయి.

ఇంటి ముందు ఏంపెట్టాలన్నా భయమే

ఇళ్లముందు బైకులు, ఆటోలు, బిందెలు, ఇతర సామాన్లను సైతం దొంగలు బతకనివ్వడం లేదు. బైకుల్లో పెట్రోల్, ఆటోల్లో సీట్లు, మ్యాట్‌లతోపాటు డ్రెయిన్లపై అమర్చిన ఐరన్ గ్రిల్స్‌ను సైతం దోచేస్తున్నారు. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రధానంగా ఇందిరానాయక్‌నగర్, నందమూరినగర్, తోటవారివీధి, సింగ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ, సిద్ధార్థ నగర్, భారతమాత మందిరం రోడ్డు, పీఅండ్‌టీ కాలనీ ప్రాంతాల్లో దొంగలు పెట్రేగిపోతున్నారు.


కాళ్లతో తాళాలు విరగ్గొట్టి స్కూటీని కాజేస్తున్న దొంగలు

కొన్ని ఘటనలు

- సింగ్‌నగర్ లూనాసెంటర్‌కు చెందిన విశాలాక్షి అనే మహిళ ఇంటిలో గత నెలలో దొంగలు పడ్డారు. వరదల్లో చిక్కుకున్న వారు తమ ఇంటికి తాళాలు వేసి రెండు రోజుల తర్వాత వచ్చి చూడగా బీరువాలో ఉన్న రూ. 1.6 లక్షల నగదు, రెండున్నర తులాల వెండి కలిపి మొత్తం రూ. 4 లక్షల వరకూ సొత్తును ఎత్తుకెళ్లారు.
- నందమూరినగర్‌కు చెందిన తాళ్లపల్లి నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇంటిలో గత నెలలో దొంగలు పడి రూ. 2 లక్షల నగదు, బంగారు నగలను చోరీ చేశారు.
- సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌కు చెందిన రవికుమార్ ఇంట్లో రూ. 1.50 లక్షలు, తోటవారి వీధి, నందమూరినగర్ ప్రాంతాలకు చెందిన జి.బాబ్జీ, నాగులమ్మ, కనకదుర్గ అనే వారి ఇళ్లల్లో రూ. 44 వేలు, రూ. 34 వేలు, రూ. 22 వేలు విలువైన నగలు, నగదు చోరీకి గురయ్యాయి.
- నందమూరినగర్ భారతమాత మందిరం సమీపంలోని ఏంజెల్స్ బ్యూటీ పార్లర్ సమీపంలో నిలిపిన ఏపీ 39 ఆర్ఎక్స్ 8128 నెం. గల స్కూటీని దొంగలు అర్ధరాత్రి వచ్చి చాకచక్యంగా తమ కాళ్లతో బైకు తాళాలు విరగ్గొట్టి దొంగిలించారు.
- సింగ్‌నగర్ రైతుబజార్ సమీపంలో, ఎమ్మెల్సీ కార్యాలయం వద్ద, ఎంకే బేగ్ స్కూల్‌కు వెళ్లే రహదారిలోని డ్రెయిన్లపై ఉన్న ఐరన్‌గ్రిల్స్‌ను విరక్కొట్టి కాజేశారు.
- సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ చెంతనే ఉన్న న్యూరాజరాజేశ్వరీపేట, ఇందిరానాయక్‌నగర్, నందమూరినగర్ ప్రాంతాల్లో పెట్రోల్ దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయి. ఇంటి ముందు నిలిపిన వాహనాల్లో పెట్రోల్‌ను, ఇంటి సామాన్లు తరచూ చోరీకి గురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.


ఇందిరానాయక్‌నగర్‌లోని ఓ ఇంటిలో బీరువా తాళాలు పగలకొట్టిన దొంగలు

నిఘా వైఫల్యం

దొంగతనాలను అరికట్టడంలో పోలీసుల వైఫల్యం ఉందని స్థానిక ప్రజలు, బాధితులు వాపోతున్నారు. ప్రధానంగా గతంలో మాదిరిగా తమ ప్రాంతాల్లో పోలీసుల ప్రత్యేక బీట్లు వేయడం లేదని, దీని వల్ల రాత్రి వేళల్లో ఎవరు పడితే వారు అకారణంగా రోడ్లపై తిరుగుతున్నారని చెబుతున్నారు. బ్లూ కోట్స్ సిబ్బంది సైతం రోడ్లపై ఉన్న వ్యాపారుల వద్ద వసూళ్లు చేయడంపై చూపుతున్న శ్రద్ధ నేరస్తులను గుర్తించడంపై చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దొంగతనాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టడంలో కానీ.. జరిగిన తర్వాత కనీసం ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయడంలో కానీ పోలీసులు ముందుకు రావడం లేదని చెబుతున్నారు. చోరీ ఘటనలు చాలా వరకూ మీడియాకు తెలియకుండా గోప్యంగా ఉంచేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. దీంతో ఈ స్టేషన్ పరిధిలో దొంగతనాల సంఖ్య క్రమేపీ పెరుగుతోందని స్థానిక పెద్దలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు తమ ప్రాంతాల్లో జరుగుతున్న దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించి, తమకు రక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


డ్రెయిన్లపై ఐరన్ గ్రిల్స్‌ను దొంగలు కాజేయడంతో కర్రలు, నాపరాళ్లు పెట్టిన దృశ్యం

క్లుప్తంగా

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోండి

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వచ్చే ఏడాది జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. కొత్త వారితోపాటు పాతవారు కూడా నమోదు చేసుకోవాలని.. సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్, ఫొటో, ఆధార్ కార్డుతో ఫారం –18 ద్వారా ఆన్‌లైన్లో ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే పట్టభద్రుల సౌకర్యార్థం ఆంధ్రప్రభకాలనీలోని జనహిత సదనంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫోన్ నెంబర్ 8919826398ను కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు చైతన్యవంతంగా వ్యవహరించి తమ ప్రతినిధులను ఎన్నుకోవాలని ఈ సందర్భంగా మల్లాది విష్ణు పిలుపునిచ్చారు.

అలుపెరుగని బాలల హక్కుల నేత టీవీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వీధి బాలల సంరక్షణ, బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రథమ మేయర్ టి. వెంకటేశ్వరరావు (టీవీ) అలుపెరుగని కృషి చేశారని ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కోఆర్డినేటర్ అరవ రమేష్ అన్నారు. హనుమాన్‌పేటలోని తానా భవన్‌లో సోమవారం విజయవాడ నగర ప్రథమ మేయర్, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు టీవీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత టీవీ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ టీవీ మార్గం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌కేసీవీ ట్రస్ట్ మేనేజర్ కె. చంద్ర, బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ కె. ప్రకాష్ కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెట్టుబడులపై అవగాహన సదస్సు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ పెట్టుబడిదారుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం గురుకుల సాంఘిక సంక్షేమ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పెట్టుబడులపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో సెబీ (సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా)కి చెందిన ప్రముఖ శిక్షకుడు డాక్టర్ ఓలేటి అచ్యుతరావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పెట్టుబడులు పెట్టడంలో మెలకువలు, పొదుపు సేవలు, స్టాక్ మార్కెట్, ద్రవ్యోల్బణం, షేర్లు, బాండ్లు, మ్యూచువల్ ఫండ్లు తదితర పెట్టుబడి అంశాల గురించి విద్యార్థినులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో మెలకువలు తెలుసుకుని రాణించడానికి ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సుధారాణి, సత్యవాణి, డాక్టర్ బాలకృష్ణ, అరుణ, సుమిత్ర, ప్రసాదరావు, దివ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు భద్రత కల్పించాలి

రైల్వే కార్మిక సంఘాల నేతలు


డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నేతలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే కార్మికులకు భద్రత కల్పించాలని రైల్వే కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. విజయవాడ డివిజన్ లోకో పైలట్ ఎబినేజర్ హత్యను నిరసిస్తు పలు రైల్వే కార్మిక సంఘాలు సోమవారం విజయవాడ రైల్వే స్టేషన్‌లోని క్రూ బుకింగ్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. తొలుత ప్రాణాలు కోల్పోయిన లోకో పైలట్‌కు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్మిక సంఘాల నేతలు ప్రదర్శనగా డీఆర్ఎం కార్యాలయం చేరుకుని ఇటువంటి ఘటనలు పునావృతం కాకుండా పని ప్రదేశాల్లో ఉద్యోగులకు భద్రత కల్పించాల్సిందిగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఏఐఎల్ఆర్ఎస్ఏ విజయవాడ డివిజన్ కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. రాత్రుళ్లు స్టేషన్ అవుటర్లు, యార్డ్‌ల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని, పోలీసు బీటు పెంచాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ విజయవాడ డివిజన్ ప్రెసిడెంట్ కె.రమేష్, ఎంప్లాయీస్ సంఘ్ ఏజీఎం వై.నాగేంద్ర బాబు, మజ్దూర్ యూనియన్ రన్నింగ్ బ్రాంచ్ కార్యదర్శి ఎం. క్రాంతికుమార్, సీఐటీయూ నాయకుడు వి.వి.ఎల్ నరసింహులు, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం


చండీహోమంలో సీఐ గురుప్రకాష్


అన్నదానం ప్రారంభిస్తున్న సీపీ

వన్‌టౌన్ పీఎస్‌లో పూర్ణాహుతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపును పురస్కరించుకొని వన్‌టౌన్ పీఎస్ ప్రాంగణంలో సోమవారం అన్నసమారాధన జరిగింది. స్టేషన్ ప్రాంగణంలో కలశాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ముగింపు సందర్భంగా పీఎస్ ప్రాంగణంలో దసరా ఉత్సవాల్లో చండీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీపీ రాజశేఖర్‌బాబు, పలువురు ఐపీఎస్ అధికారులు హాజరై పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల అనంతరం అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా సీపీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేలాది మంది పేదలకు అన్నదానం చేశారు. పోలీస్ కుటుంబాలు సైతం స్టేషన్ ప్రాంగణంలో అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సీపీతో పాటు నగరంలోని జాయింట్ సీపీ, డీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు. స్థానిక సీఐ గురుప్రకాష్, ఏసీపీ ఎస్ దుర్గారావు కార్యక్రమాలను నిర్వహించారు. దుర్గగుడి ఈఓ కేఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు విజయవంతం : సీపీ

తమ పోలీసు శాఖ అంకిత భావంతో పని చేసి దసరా ఉత్సవాలను విజయవంతం చేశారని సీపీ రాజశేఖర్‌బాబు అన్నారు. వన్‌టౌన్ స్టేషన్ ప్రాంగణంలో పూజల అనంతరం ఆయన సిబ్బందిని అభినందించారు. పదకొండు రోజుల పాటు రద్దీ కొనసాగిందన్నారు. వేలాది మంది సిబ్బందితో తమ శాఖ బందోబస్తు చేపట్టిందని వివరించారు.

2 నుంచి కార్తిక మాసోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో శివకేశవులకు ప్రీతికరమైన కార్తిక మాసోత్సవాలను వచ్చేనెల 2వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు తెలిపారు. ఆలయంలో సోమవారం కార్తిక మాసోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వ తేదీ శనివారం తెల్లవారుజామున 5 గంటలకు గోపూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 5న నాగుల చవితి సందర్భంగా నాగదోష నివారణ అభిషేకం, 15న కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని లక్ష బిల్వార్చన, నందాదీప సేవ, జ్వాలాతోరణం జరుగుతాయని తెలిపారు. 17న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తామన్నారు. అనంతరం కార్తిక మాసోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిరంజీవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


కార్తిక మాసోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆసక్తికరంగా 'పొట్టేల్'

చిత్ర హీరోయిన్ అనన్య నాగళ్ల



లబ్బీపేట(విజయవాడతూర్పు): తెలంగాణ నేపథ్యంలో సాగే పొట్టేల్ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, ఎంతో ఆసక్తికరంగా ఉంటుందని ఆ చిత్ర హీరోయిన్ అనన్య నాగళ్ల పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీన విడుదల కానున్న పొట్టేల్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సభ్యులు సోమవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో అనన్య నాగళ్ల మాట్లాడుతూ ఇప్పటి వరకూ తాను చేసిన చిత్రాల కంటే భిన్నంగా ఈ సినిమా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. అనంతరం హీరో యువచంద్రకృష్ణ మాట్లాడుతూ దర్శకుడు సాహిత్ మోతుకూరి చెప్పిన కథ నచ్చి, వెంటనే పొట్టేల్ చిత్రంలో నటించినట్లు తెలిపారు. సమావేశంలో చిత్ర సహనిర్మాత నిశాంక్‌రెడ్డి, నటుడు నోయల్ కూడా పాల్గొన్నారు.

బావి రోడ్డులో చోరీ

8 గ్రాముల బంగారం, రూ. 20వేలు నగదు చోరీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో బీరువాలోని రూ. 20వేలు నగదు, 8 గ్రాముల బంగారం చోరీ అయ్యిందంటూ సోమవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ బావి రోడ్డుకు చెందిన కొప్పుల ఆనంద్‌బాబు చెప్పుల దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈయన ఆదివారం రాత్రి 11 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోయారు. సోమవారం ఉదయం 6 గంటలకు నిద్రలేచి చూసేసరికి బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. బీరువాలో ఉండాల్సిన రూ. 20వేల నగదు, 8 గ్రాముల బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో ఆనంద్‌బాబు గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఆర్ఆర్ కళాశాల స్థలాన్ని పరిరక్షించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరం నడిబొడ్డులో కోట్లాది రూపాయలు విలువ చేసే ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని ప్రభుత్వం పరిరక్షించాలని కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులోని కళాశాలకు చెందిన స్థలంలో సోమవారం పూర్వ విద్యార్థులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 నుంచి తాము కళాశాల స్థలాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నామన్నారు. కళాశాలకు చెందిన 6.67 ఎకరాలను ఆక్రమించేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారన్నారు. అప్పటి కళాశాల ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థి డాక్టర్ వెలగా జోషి హయాంలో స్థలాన్ని కాపాడేందుకు పూర్వ విద్యార్థులందరం కలిసి ముందుకు రావడం జరిగిందని చెప్పారు. అప్పటి ఆక్రమణలను తాము జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అడ్డుకున్నామని తెలిపారు. ఈ స్థలాన్ని దయచేసి ఎవరూ కొనవద్దని విజ్ఞప్తి చేశారు. కళాశాల స్థలాన్ని ఆక్రమిస్తున్నారంటూ తాము ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించి పనులు నిలిపివేయించిన జిల్లా కలెక్టర్ సృజనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు లంకా జానయ్య, కార్యదర్శి చిగురుపాటి యుగంధర్, ఉపాధ్యక్షుడు ఆళ్ల వేణుగోపాలరావు, దోనేపూడి శంకర్, దోనేపూడి కాశీనాథ్, చెరుకూరి కృష్ణకుమార్, నాని పాల్గొన్నారు.


ఎస్ఆర్ఆర్ కళాశాల స్థలాన్ని పరిరక్షించాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న పూర్వ విద్యార్థులు

జ్యోత్స్న అకాల మరణం మహిళా లోకానికి తీరని లోటు

విజయవాడస్పోర్ట్స్: మహిళ భద్రత, సాధికారత కోసం ఉద్యమించిన జ్యోత్స్న అకాల మరణం మహిళా లోకానికి తీరని లోటని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామప్రసాద్(రాజా) అన్నారు. రాజస్థాన్‌లోని జోద్‌పూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జ్యోత్స్న మృతిచెందిన విషయం తెలిసిందే. బీబీఏ గవర్నింగ్ బాడీ సభ్యులు బీబీఏ హాలులో సోమవారం ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె పవిత్రాత్మకు శాంతి చేకూరాలని, ఆమె భర్త సీనియర్ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ త్వరగా కోలుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గురునాథం, పిల్లా రవి, అయ్యల రాంప్రసాద్, వినోద్, శ్రీనివాసరావు, వి. రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, సుంకర నాగసురేష్, సుంకర శ్రీనివాసరావు, ప్రభాకర్, వేల్పుల కోటయ్య, గడ్డం జయరాం, అబ్దుల్ రజాక్, పూర్ణ మహేష్, చునావ్, రమణి పాల్గొన్నారు.


జ్యోత్స్న చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీబీఏ న్యాయవాదులు

ముగిసిన శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు


అమ్మవారి ఊరేగింపులో కళాకారుల విన్యాసాలు


ముత్యాలంపాడులో అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ మెయిన్ రోడ్డులో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని ఉంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ నృత్యాలు, కోలాటం, బేతాళసెట్టుతో ఊరేగింపు జరిగింది. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు అమ్మవారి ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు.

శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో..

ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు సోమవారంఘనంగా ముగిశాయి. 11 రోజులుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు వేదపండితులచే శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం దాత కుంచనపల్లి రవిశంకర్ దంపతులచే అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను పాలకవర్గం సభ్యులు పర్యవేక్షించారు.


క్యూలైన్‌లో భక్తులు


కృష్ణవేణి ఘాట్‌లో జల్లు స్నానాలు

భక్తజనకీలాద్రి

వివిధ ప్రాంతాల నుంచి మాల విరమణకు వచ్చిన భవానీలతో సోమవారం ఇంద్రకీలాద్రి పరిసరాలు కిక్కిరిసిపోయాయి. జైభవానీ.. జైజై భవానీ అంటూ భక్తజనం అమ్మవారికి జయజయధ్వానాలు పలికారు. ఆలయ క్యూలైన్లలో భవానీలు బారులు తీరి కనిపించారు. కృష్ణమ్మ చెంతన జల్లుస్నానాలు ఆచరించారు. అన్నప్రసాదం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో ఉండటంతో కింద కూర్చునే భోజనం చేశారు. అర్జున వీధిలో దుకాణాల వద్ద భక్తజన సందడి అధికంగా కనిపించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ




ఇంద్రకీలాద్రిపై మాల విరమణ చేస్తున్న భవానీలు


కొండదిగువన భక్తులు

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి


సినీ సంగీత విభావరిలో పాల్గొన్న గాయకులు

విజయవాడ కల్చరల్: దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా 'నా నేస్తం సాంస్కృతిక సేవా సంస్థ' ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. కార్యక్రమాలను ప్రారంభించిన సంస్థ అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. సీనియర్ గాయకులను ఆదర్శంగా తీసుకొని తమదైన ముద్రతో నిరంతరం సాధన చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ కార్యనిర్వాహక సంఘ సభ్యులు లక్షణ్‌నాయక్, నాగలక్ష్మి, షబానా, శ్రీను, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. గాయకులు మహేశ్వరి, కృష్ణకుమారి, ఉషా రెడ్డి, భావన, శైలజ, సీత, రాధానాయుడు, దయామణి ఆ పాత మధురాల పేరుతో పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.